సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 8 । ఫిబ్రవరి । 2025



క్షీరాభిషేక సేవ

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు.



శ్రీవారికి పట్టు వస్త్రాలు

కొమ్మాది: రుషికొండలోని మహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామికి శుక్రవారం పట్టు వస్త్రాలు సమర్పించారు.



నిద్రపోతున్న 'టూరిజం'

అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన రుషి కొండ బీచ్‌లో అడుగడుగునా పర్యాటక శాఖ నిర్లక్ష్యం కనిపిస్తోంది. 8లో

న్యూస్‌రీల్

బాల్యవివాహాలను ప్రోత్సహిస్తే పోక్సో కేసు

- రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

రంపచోడవరం: బాల్యవివాహాలు నేరమని, వాటిని ప్రోత్సహించినా, బాలికలు గర్భందాల్చేలా ప్రోత్సాహించినా సెక్షన్ -6 ప్రకారం పోక్సో కేసు నమోదు చేయడం జరుగుతుందని రంపచోడవరం సబ్ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ అన్నారు. తన చాంబర్‌లో శుక్రవారం లింగ నిర్ధారణ నిర్మూలన కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్పత్రుల్లో లింగనిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని తెలిపారు. సురక్షితంగా గర్భం దాల్చే విధానాలపై వివాహమైన మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎక్కడైనా లింగ నిర్ధారణ చేసినట్టు తెలిస్తే టోల్ ఫ్రీ నంబరు 18004253365 కు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ రవీంద్ర, ఎస్ఐ వి. వెంకటరావు, సీడీపీవో సంధ్యారాణి పాల్గొన్నారు.

త్వరితగతిన పెండింగ్ పనులు పూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు

పెదబయలు: పాఠశాలల్లో ఆఫ్‌లైన్,ఆన్‌లైన్ పనులతో పాటు పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు సూచించారు. స్థానిక మండల విద్యాశాఖ అధికారి-1 కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మండలంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో శుక్రవారం అత్యవసర సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు తప్పనిసరిగా ముఖ హాజరు వేయాలని,విద్యార్థుల హాజరు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, భద్రపరచాలని సూచించారు. 2025-26 సంవత్సరంలో ఎఫ్ఎ 3 మార్కుల అప్ లోడింగ్, ఎస్ఎ-1 పెండింగ్ మార్కుల అప్‌లోడింగ్, హౌస్ హోల్డింగ్ మ్యాపింగ్‌లో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ(విశాఖ): నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఏసీ), ఏపీ స్టేట్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎన్‌ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్లంబర్ కోర్సులో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. 18 నుంచి 35 ఏళ్ల లోపు ఉండి, పదో తరగతి పాసైన వారు అర్హులన్నారు. మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు పెదగంట్యాడలోని ఎన్‌ఏసీ శిక్షణ సంస్థలో సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 9133242666 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మావోయిస్టుల సంచారంపై సమాచారమివ్వండి



ఏడుగురాళ్లపల్లి సంతలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎస్‌ఐ రమేష్

చింతూరు: మావోయిస్టు పార్టీకి చెందిన యాక్షన్ టీం సభ్యుల సమాచారం తెలిపితే రూ.5లక్షల నుంచి నుంచి 10 లక్షల నజరానా అందిస్తామంటూ శుక్రవారం ఏడుగురాళ్లపల్లి సంతలో ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు కరపత్రాలు పంపిణీ చేశారు. ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దుల్లో సంచరిస్తున్న యాక్షన్ టీం సభ్యులకు సంబంధించి 18 పేర్లతో కూడిన కరపత్రాలను వారు సంతలో పంపిణీ చేశారు. సమాచారం తెలిస్తే పోలీసులు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్‌ఐ రమేష్ పేర్కొన్నారు.



దివ్యాంగ కుమారుడిని వైద్యపరీక్షలకు తీసుకువచ్చిన గిరిజనుడు

విధి వక్రించింది.. వైకల్యం బారిన పడడంతో ప్రభుత్వం ఇచ్చే పింఛన్‌పై ఆధారపడి మనో వేదనతో జీవనం సాగిస్తున్నారు వారు.. అలాంటి దివ్యాంగులను కూటమి ప్రభుత్వం వైద్య పరీక్షల పేరుతో తీవ్ర క్షోభకు గురిచేస్తోంది. వారికిస్తున్న పింఛన్లలో కోత విధించేందుకు సర్వేలు, పరీక్షలతో ఇబ్బందుల పాలు చేస్తోంది. పింఛన్ల పెంపు హామీని నిలబెట్టుకోలేక మానవత్వం మరిచి ప్రవర్తిస్తోంది. పాడేరు జిల్లా ఆస్పత్రిలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న సర్టిఫికెట్ల పునఃపరిశీలనకు జిల్లాలో నలుమూలల నుంచి ఇబ్బందులు పడి, అతి కష్టం మీద దివ్యాంగులు ఇక్కడికి చేరుకున్నారు. వారి అవస్థలు చూసిన **కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు తీవ్ర క్షోభకు గురయ్యారు.**

కక్షా..పరీక్ష

దేవుడా ఎందుకీ శిక్ష

- మళ్లీ పరీక్షల పేరుతో మానసిక క్షోభ
- నరకం చూస్తున్న దివ్యాంగులు
- కుటుంబాలతో పాడేరు జిల్లా ఆస్పత్రిలో అవస్థలు
- ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బాధితులు



అడ్డతీగల ప్రాంతం నుంచి వచ్చిన మానసిక రోగులు



పాడేరు జిల్లా ఆస్పత్రిలో దివ్యాంగులను పరీక్షిస్తున్న వైద్యుడు



ఆస్పత్రిలో నిరీక్షిస్తున్న దివ్యాంగులు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా మానసికరోగులు, దివ్యాంగులకు మరో సారి వైద్యపరీక్షలు చేయాలని కూటమి ప్రభుత్వం ఆదేశించింది. దీంతో జిల్లా కేంద్రం పాడేరులోని జిల్లా సర్వజన ఆస్పత్రిలో రెండు రోజుల నుంచి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు.మొదటి విడతలో జిల్లాలోని పింఛన్లు పొందుతున్న 8,582 మంది దివ్యాంగులు, మానసిక రోగులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తుండడంతో పలు ప్రాంతాలకు చెందిన వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతూ పాడేరులోని జిల్లా ఆస్పత్రికి చేరుకుంటున్నారు.నడవలేని వారు, అంధులు, మానసిక రోగులు ఇక్కడికి చేరుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు. వారి అవస్థలను చూసిన కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమవుతున్నారు. 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న రంపచోడవరం డివిజన్‌లోని పలు గ్రామాల నుంచి సుమారు 100మంది మానసిక రోగులు,దివ్యాంగులు వ్యయప్రయాసలతో ఇక్కడికి వచ్చారు. అంగవైకల్యంతో తీవ్రమనోవేదనకు గురవుతున్న తమను ఎక్స్‌రేలు,స్కానింగ్‌ల పేరుతో మానసిక క్షోభకు గురిచేస్తున్నారని బాధితులతో పాటు వారి కుటుంబ సభ్యులు వాపోయారు.



కనిపిస్తున్నా.. కనికరం లేదా

చిన్నతనం నుంచి గూని కారణంగా ఎదుగదల **లేక తీవ్ర ఇబ్బంది**లు పడుతున్నాను.ఇ**ప్పుడు నా వయసు 29** ఏళ్లు.గత 10ఏళ్ల నుంచి **పింఛన్ పొందుతున్నాను**.మళ్లీ వైద్యపరీక్షలు **జరుపుకోవాలని అధికా**రులు చెప్పడంతో **పాడేరు జిల్లా ఆస్పత్రికి** వచ్చాను.నేను దివ్యాం**గురాలిని వైద్యుల కళ్లకు** కనబడుతున్నప్పటికీ ఎక్స్‌రే పరీక్షలు జరపడం బాధాకరం.

– **కూడ విజయలక్ష్మి**, దివ్యాంగురాలు, పాడేరు



ట్రై సైకిళ్లలో దివ్యాంగులు

ఇది అన్యాయం



దివ్యాంగుడైన నేను గత ఏడేళ్లుగా పింఛన్‌పొందుతున్నాను. నడవలేని నాకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంమూడు చక్రాల స్కూటీని కూడా అందజేసింది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వైద్యపరీక్షలు పేరుతో నరకం చూపడం అన్యాయం.

– **పరదాని జగన్నాథం**, దివ్యాంగుడు నిట్టాపుట్టు గ్రామం, జి.మాడుగుల మండలం

చాలా దారుణం



కాళ్లు విరిగిపోయి నడవలేని స్థితిలో ఉన్న నాకు నాలుగేళ్ల క్రితం ప్రభుత్వం పింఛన్‌ను మంజూరు చేసింది.ప్రతినెల ఈ పింఛన్ సొమ్ముతో ఆర్థిక అవసరాలు తీర్చుకుంటున్నాను. వైద్యపరీక్షల పేరుతో ఇబ్బందులకు గురి చేయడం దారుణం.

– **మాతే జానకమ్మ**, దివ్యాంగురాలు, కూనేటి గ్రామం, జి.మాడుగుల

కేకేలైన్‌ను రాయగడ డివిజన్‌లో కలపొద్దు

- ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అరకులోయటౌన్: కొత్తవలస-కిరండూల్ రైల్వేలైన్‌ను వాల్తేరు డివిజన్ నుంచి వేరు చేసి, రాయగడ డివిజన్‌లో కలపాలన్న నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.అరకును వాల్తేరు డివిజన్‌లోనే కొనసాగించాలన్నారు. అధిక ఆదాయం వచ్చే కేకే లైన్‌ను వాల్తేరు డివిజన్ నుంచి వేరు చేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. కేకేలైన్‌తో కూడిన వాల్తేరు డివిజన్ కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి పాంగి చిన్నారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు స్వాభి రామమూర్తి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గెద్దం నర్సింగరావు, వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు కమిడి అశోక్, ఒలేసి రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మంజూరుకు 6,596 కుటుంబాల గుర్తింపు



ఆదివాసీ మహిళతో మాట్లాడుతున్న హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ బాబూనాయక్

జి.మాడుగుల: జిల్లాలో చివరి విడతగా పీఎం జన్‌మన్ పథకం కింద ఇళ్ల మంజూరుకు అర్హతగల 6,596 ఆదివాసీ గిరిజన కుటుంబాలను గుర్తించినట్టు హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ బాబూనాయక్ తెలిపారు. మండలంలో పలు ఆదివాసీ గిరిజన గ్రామాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఇళ్ల మంజూరుకు అర్హతగల పీవీటీజీ కుటుంబాల గుర్తింపునకు త్వరితగతిన సర్వే చేయాలన్నారు. జి.మాడుగుల మండలంలో ఇళ్ల మంజూరుకు 768 మందిని అర్హులుగా గుర్తించినట్టు చెప్పారు. మిగిలిపోయిన వారు ఎవరైనా ఉంటే ఈ నెల11లోగా ఇంజినీరింగ్ అసిస్టెంట్ సర్వే చేయాలని తెలిపారు.

గిరిజన ప్రాంతంలో సేవలందించడం అదృష్టం

బదిలీపై వెళుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్



బదిలీపై వెళ్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు: గిరిజన ప్రాంతంలో సేవలందించడం అదృష్టంగా భావిస్తున్నానని బదిలీపై వెళుతున్న ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. అందరి సహకారంతో సంతృప్తికరంగా విధులు నిర్వహించానని చెప్పారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో శుక్రవారం అభిషేక్ ఆత్మీయ వీడ్కోలు సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేక్ మాట్లాడుతూ 516ఈ జాతీయ రహదారికి భూసేకరణ చేయడం, మారుమూల గ్రామాల్లో రూ.400 కోట్లతో రహదారుల నిర్మాణం, చిన్న నీటి పారుదల పథకం కింద రూ.12 కోట్లతో పనులు, పీఎం జన్‌మన్ కింద 554 గృహాలకు విద్యుత్ సౌకర్యం కల్పన తదితర పనులు సంతృప్తినిచ్చాయన్నారు. చాపరాయి, కొత్తపల్లి జలపాతాలు, పద్మాపురం గార్డెన్ అభివృద్ధికి కృషి చేశానని చెప్పారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ బదిలీపై వెళుతున్న అభిషేక్ గిరిజన ప్రాంతం అభివృద్ధికి ఎంతో కృషి చేశారని తెలిపారు. రాష్ట్రంలోనే పెద్ద ఐటీడీఏ అయిన పాడేరులో అనేక సవాళ్లను ఎదుర్కొని సమస్యలు పరిష్కరిస్తూ విధులు నిర్వహించారని చెప్పారు. జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డీఎఫ్‌వో పి.వి.సందీప్‌రెడ్డి, డీఆర్‌వో పద్మలత, సహాయ ప్రాజెక్టు అధికారులు వి.ఎస్ ప్రభాకరరావు, వేంకటేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, జిల్లా ఉద్యానవన శాఖధికారి రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ స్థలం పరిశీలన



జడ్డంగి వద్ద పెట్రోల్ బంక్ నిర్మించనున్న స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ కల్పశ్రీ

రాజవొమ్మంగి : మండలంలోని జడ్డంగిలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయనున్న స్థలాన్ని రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పశ్రీ శుక్రవారం పరిశీలించారు. ఈ ప్రాంతంలో జీసీసీ ఆధ్వర్యంలో ఇప్పటికే పెట్రోల్ బంక్ ఏర్పాటు కావలసి ఉంది. కాగా జాతీయరహదారి నిర్మాణం జరగడంతో పెట్రోల్ బంక్ నిర్మించాల్సిన స్థలం లోతుగా మారింది. దీంతో ఈ స్థలాన్ని రహదారికి సమానంగా ఎత్తుచేయాలని అధికారులు భావిస్తున్నారు. స్థలాన్ని ఎత్తుచేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై స్థానిక తహసీల్దార్ సత్యనారాయణ, జీసీసీ డీఎం పార్వతీశ్వరావులతో సబ్ కలెక్టర్ చర్చించారు. జాతీయరహదారి నిర్మిస్తున్న సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు. జడ్డంగి మీదుగా వెళుతున్న జాతీయరహదారిని కలుపుతూ మూడు చోట్ల అప్రోచ్ రోడ్లు నిర్మించాలని జడ్డంగి సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామకృష్ణ తదితరులు సబ్ కలెక్టర్ కల్పశ్రీని కోరారు. ఇందుకు సబ్‌కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి గల అవకాశాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం(విశాఖ): కుంభమేళాకు మరిన్ని ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. విశాఖపట్నం-గోరఖ్‌పూర్(08588) స్పెషల్ ఈ నెల 10, 22వ తేదీల్లో రాత్రి 10.20 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరుతుంది. ఈ నెల 12, 24వ తేదీల్లో రాత్రి 7.30 గంటలకు గోరఖ్‌పూర్ చేరుకుంటుంది. గోరఖ్‌పూర్-విశాఖపట్నం (08587) స్పెషల్ ఈ నెల 13, 25వ తేదీల్లో సాయంత్రం 5.45 గంటలకు బయల్దేరి 15, 27వ తేదీల్లో మధ్యాహ్నం 3.55 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు 4-సెకండ్ ఏసీ, 3-థర్డ్ ఏసీ ఎకానమీ, 8-స్లీపర్ క్లాస్, 4-జనరల్, 1-సెకండ్ క్లాస్ కం లగేజీ/దివ్యాంగ కోచ్, 1జనరేటర్ మోటర్ కార్ కోచ్‌తో నడుస్తుంది.

టాటా–యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం(విశాఖ): కాజీపేట-విజయవాడ సెక్షన్ పరిధి ఖమ్మంలో జరుగుతున్న ఆధునీకరణ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే టాటానగర్-యశ్వంత్‌పూర్-టాటానగర్ ఎక్స్‌ప్రెస్‌ను ఆయా తేదీల్లో రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ నెల 13న టాటానగర్-యశ్వంత్‌పూర్(18111) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 9,16న యశ్వంత్‌పూర్-టాటానగర్ (18112) ఎక్స్‌ప్రెస్ రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి

మాజీ ఎమ్మెల్సీ, ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసులు నాయుడు



కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న పీఆర్టీయూ మద్దతు అభ్యర్థి గాదె శ్రీనివాసులు నాయుడు

మహారాణిపేట (విశాఖ): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను శక్తి వంచన లేకుండా పరిష్కరిస్తానని మాజీ ఎమ్మెల్సీ, ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసులు నాయుడు అన్నారు. ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీగా నామినేషన్ దాఖలు చేసిన తర్వాత కలెక్టరేట్ ప్రాంగణంలో శ్రీనివాసుల నాయుడు మీడియాతో మాట్లాడారు. గతంలో తాను ఎమ్మెల్సీగా పనిచేసిన సమయంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించడంలో కీలకంగా పని చేశానన్నారు. తనకు పలు ఉపాధ్యాయుల సంఘాల మద్దతు ఉందని తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌కు సమీపంలోని ప్రైవేట్ ఫంక్షన్‌ హాలులో ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ, మిత్ర సంఘాలు ఏపీటీఎఫ్ 1938, ఏపీ యూఎస్, ఎస్టీయూ, ఏపీటీడబ్ల్యూటీఏ, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్, పీఈటీ అసోసియేషన్, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్(ఏపీటీఏ), గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ లెక్చరర్స్ అసోసియేషన్, కాంట్రాక్ట్ డిగ్రీ లెక్చరర్స్ అసోసియేషన్, జూనియర్ కాలేజ్ లెక్చరర్స్ అసోసియేషన్‌లు శ్రీనివాసులు నాయుడుకు మద్దతు ప్రకటించాయి. పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మిట్ట కృష్ణయ్య, ఏఎం గిరిప్రసాద్ రెడ్డి, రాష్ట్రస్థాయి నాయకుడు వైష్ణవ కరుణానిధి, ఏపీటీఎఫ్(1938) రాష్ట్ర అధ్యక్షుడు హృదయ రాజు, ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఎస్టీయూ విశాఖ జిల్లా అధ్యక్షుడు ఇమంది పైడిరాజు పాల్గొనగా.. పీఆర్టీయూ ఉమ్మడి జిల్లా కన్వీనర్ డి.గోపీనాథ్ ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు పి.వి.ఎన్.మాధవ్ సమావేశంలో పాల్గొని.. రాజకీయాలకు అతీతంగా.. ఉపాధ్యాయుల సమస్యలపై పట్టు ఉన్న గాదె శ్రీనివాసుల నాయుడును ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ఆరు జిల్లాలకు సంబంధించిన అన్ని సంఘాల అధ్యక్ష కార్యదర్శులు హాజరయ్యారు.

ఎమ్మెల్సీ స్థానానికి ఐదో రోజు నాలుగు నామినేషన్లు

- ఇప్పటివరకు 8 నామినేషన్ల దాఖలు
- శని, ఆదివారం సెలవు, సోమవారం ఆఖరు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానానికి శుక్రవారం మరో నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. దీంతో ఇప్పటి వరకు దాఖలైన నామినేషన్ల సంఖ్య 8కి చేరింది. పీఆర్టీయూ మద్దతుతో మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, స్వతంత్ర అభ్యర్థులు నూకల సూర్యప్రకాష్, రాయల సత్యనారాయణ, ఎస్సీ, ఎస్టీ బహుజన ఫోరం అభ్యర్థి పోతల దుర్గారావు తమ మద్దతుదారులతో కలిసి రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్‌కు సంబంధిత పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అభ్యర్థులతో కలెక్టర్ ప్రమాణం చేయించారు. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియకు గడువు కాగా.. ఇప్పటికే ఐదు రోజులు గడిచిపోయింది. రెండో శనివారం, ఆదివారం సెలవు కావడంతో సోమవారం ఒక్క రోజే ఇంకా నామినేషన్లు వేయడానికి గడువు ఉంది. ఇప్పటివరకు ఎనిమిది నామినేషన్లు దాఖలవ్వగా అభ్యర్థులు 14 సెట్లు సమర్పించారు. ఏఆర్వో, డీఆర్వో బీహెచ్ భవానీశంకర్, నోడల్ అధికారి, వీఎంఆర్డీఏ ఎస్టేట్ అధికారి దయానిధి పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రత్యేక వైద్య శిబిరం



విద్యార్థినులకు అందుతున్న చికిత్స గురించి తెలుసుకుంటున్న ఐటీడీఏ పీవో సింహాచలం



వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న సమగ్ర శిక్ష ఏపీసీ స్వామినాయుడు

వై.రామవరం(అడ్డతీగల): వై.రామవరం మండలం తోటకూరపాలెం కేజీబీవీలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ఎటువంటి ఫుడ్ పాయిజనింగ్, నీటి కాలుష్యం జరగలేదని పేర్కొన్నారు. ఈ అంశంపై పత్రికల్లో వచ్చిన వార్తలపై విచారించి,నివేదిక ఇవాలని సమగ్ర శిక్ష ఏపీసీ స్వామినాయుడు, ఉప విద్యాశాఖాధికారి మల్లేశ్వరరావు, అడిషనల్ డీఎంహెచ్‌వో శిరీషను ఆదేశించినట్టు తెలిపారు. ఈనెల 5న శ్రావ్య అనే 9వ తరగతి బాలిక వాంతులు కావడంతో చవిటిదిబ్బలు పీహెచ్‌సీకి తీసుకెళ్లినట్టు తెలిపారు. పాఠశాలలో మిగిలిన 13 మందికి వేర్వేరు కారణాలతో వాంతులు, జ్వరం, దగ్గు, జలుబు లక్షణాలతో ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య సేవలందించినట్టు చెప్పారు. శ్రావ్య అనే విద్యార్థినికి రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలోని ఐసీయూలో చికిత్స చేయిస్తున్నట్టు పేర్కొన్నారు.మిగిలిన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. విద్యార్థినులు,వారి తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు.

మరో విద్యార్థినికి అస్వస్థత

తోటకూరపాలెం కేజీబీవీలో శుక్రవారం మరో విద్యార్థిని అస్వస్థతకు గురైంది. కాకూరి సావిత్రి అనే విద్యార్థినికి జ్వరం ఎక్కువగా ఉండడంతో చవిటిదిబ్బలు పీహెచ్‌సీకి తరలించారు.అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి పంపారు.

ఐటీడీఏ పీవో పరామర్శ

చవిటిదిబ్బలు పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న ఐదుగురు కేజీబీవీ విద్యార్థినులను ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం శుక్రవారం పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు.మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.అనంతరం తోటకూరపాలెంలోని కేజీబీవీని సందర్శించారు.

వైద్యసేవల పర్యవేక్షణ

చవిటిదిబ్బలు పీహెచ్‌సీలో ఇన్‌పేషెంట్లుగా చికిత్స పొందుతున్న ఐదుగురు విద్యార్థినులకు అందుతున్న వైద్యంపై అడిషినల్ డీఎంహెచ్‌వో శిరీష శుక్రవారం పర్యవేక్షించారు.విద్యార్థినులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో పలకజీడి ఎఫ్ఎస్‌వో మృతి


పొట్టన్న(ఫైల్)

నర్సీపట్నం/కొయ్యూరు : నర్సీపట్నం శ్రీజంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చింతపల్లి అటవీ డివిజన్ మర్రిపాకల రేంజ్ పలకజీడి అటవీ సెక్షన్ అధికారి(ఎఫ్ఎస్‌వో) ఆర్.పొట్టన్న(54) మృతి చెందారు. పాడేరు మండలం కుంచాపల్లి గ్రామానికి చెందిన పొట్టన్న కుటుంబ సభ్యులతో కలిసి నర్సీపట్నంలో నివాసం ఉంటున్నారు. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బైక్‌పై డ్యూటీకి బయలుదేరారు. యూనిఫామ్ మరిచిపోవడంతో తిరిగి ఇంటికి వెళ్తుండగా. ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో పొట్టన్న బస్సు వెనకాల టైర్ల కింద పడిపోయారు. దీంతో అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న మృతుడి కుమారుడు అక్కడకు చేరుకుని తండ్రి మృతదేహన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. టౌన్ సీఐ గోవిందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చింతపల్లి డీఎఫ్‌వో నర్సింగరావు,మర్రిపాకల రేంజర్ భార్గవ వర్మ,పెదవలస రేంజర్ శివ రజనీ తదితరులు నర్సీపట్నంలో పొట్టన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మహిళా డిగ్రీ కళాశాల సెమిస్టర్ ఫలితాలు విడుదల


ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ మంజుల

డాబాగార్డెన్స్(విశాఖ): విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను శుక్రవారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాల స్వయం ప్రతిపత్తి సాధించిన తర్వాత జరిగిన మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో 76.34 శాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమన్నారు. 2023లో నేక్ ఏ+ గ్రేడ్ సాధించి, 2024–25 నుంచి 2033–34 (పదేళ్లకు) వరకు స్వయం ప్రతిపత్తి సాధించిన కళాశాల అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నందుకు ఆమె సంతోషం వ్యక్తం చేశారు.

కుక్కల దాడిలో జింక మృతి


మృతి చెందిన జింక

కొమ్మాది(విశాఖ): ఇందిరా గాంధీ జూ పార్కు నుంచి తప్పించుకుని వచ్చిన జింక ఎండాడ బంగారమ్మ తల్లి గుడి దగ్గర కుక్కల దాడిలో మరణించింది. శుక్రవారం సాయంత్రం ఈ జింక ఆ ప్రాంతానికి చేరుకుంది. ఆ సమయంలో దాదాపు 10 కుక్కలు గుంపుగా జింకపై దాడి చేయడంతో అది అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు వెంటనే అక్కడకు చేరుకుని, శవ పరీక్ష నిమిత్తం జింక కళేబరాన్ని కంబాల కొండకు తరలించారు. ఇటీవల మారికవలస, ఎండాడ వద్ద రోడ్డు దాటుతుండగా రెండు జింకలు మరణించాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే జూలోని జింకలు తప్పించుకుని ఇలా జనారణ్యంలోకి వచ్చి మరణిస్తున్నాయని జంతు ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆ 12 గ్రామాల మెడపై 1/70?

- మైదాన ప్రాంత భూములు ఐటీడీఏలోకి విలీనం జరిగితే నష్టమే
- నియోజకవర్గంలో 12 రెవెన్యూ గ్రామాలు 1/70 యాక్టు పరిధిలోకి..
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన పాడేరు ఐటీడీఏ అధికారులు
- రాష్ట్రం నుంచి కేంద్రానికి నివేదించడానికి అధికారుల కసరత్తు
- కూటమి ప్రభుత్వం చేతిలో వేలాది మంది గిరిజనేతరుల భవిష్యత్తు
- నర్సీపట్నం నియోజకవర్గంలో రెండు మండలాలాపై ప్రభావం


1/70 యాక్టు పరిధిలోకి మార్చేందుకు ప్రతిపాదనలు చేసిన ఉటమల్ల రెవెన్యూ పరిధిలో భూములు ఇవే


మైదాన ప్రాంతంలో ఉన్న డొంకాడ గ్రామం వద్ద వెర్రిగెడ్డ అనకట్టు


1/70 యాక్టు పరిధిలోకి వద్దంటూ రెవెన్యూ సదస్సు వద్ద రైతుల ఆందోళన(పాత చిత్రం)


ఐటీడీఏ అధికారులు ప్రతిపాదనలు చేసిన మైదాన ప్రాంతం నాతవరం మండలంలో రెవెన్యూ గ్రామాలు

నాతవరం: నియోజకవర్గంలో నాతవరం గొలుగొండ మండలాల్లో 12 రెవెన్యూ గ్రామాలను 1/70 యాక్టు పరిధిలోకి మార్చేందుకు పంపించిన ప్రతిపాదనలు అడ్డుకోకపోతే గిరిజనేతరులకు ఊహించని నష్టం జరగనుంది. మైదాన ప్రాంతమైన నాతవరం మండలంలో ఉటమల్ల, డొంకాడ అగ్రహారం, చిన జగ్గంపేట, రెవెన్యూ గ్రామాలు గొలుగొండ మండలంలో పోగచెట్లపాలెం, సీతకండి, వడపర్తి, జమ్మవరం, నల్లంకి, కరక, పల్లపునాగన్నదొరపాలెం, కసిమి, కొత్తపాలెం రెవెన్యూ గ్రామాలను పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రోణంకి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో 1/70 యాక్టు పరిధిలోకి విలీనం చేసేందుకు ప్రభుత్వానికి నివేదించారు. ప్రస్తుతం అ ప్రతిపాదన రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్రానికి పంపించడానికి సంబంధిత శాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ప్రభుత్వం నుంచి 12 రెవెన్యూ గ్రామాల నివేదిక కేంద్రానికి పంపిస్తే ఆ గ్రామాలు 1/70 యాక్టు పరిధిలోకి పోతాయి. ఈ ప్రతిపాదనలు కూటమి పెద్దలు కేంద్రానికి పంపించకుండా అడ్డుకోకపోతే ఆ రెవెన్యూ గ్రామాల్లో నివాసం ఉండే గిరిజనేతరులు సర్వం కోల్పోతారు. 1/70 యాక్టు పరిధిలోకి విలీనం అయితే పూర్వం నుంచి జీవనం సాగిస్తున్న గిరిజనేతరుల భవిష్యత్తు అగోమ్యగోచరంగా తయారౌవుతుంది. షెడ్యూలు ఏరియాలోకి మార్పు చేస్తే అక్కడ కేవలం గిరిజనులకు తప్ప నివాసం ఉండడానికి సైతం నిబంధనల ప్రకారం ఎలాంటి హక్కులు ఉండవు. పూర్వం నుంచి సాగు చేస్తున్న జిరాయితీ భూములు సైతం గిరిజనేతరులు పూర్తిగా కోల్పోయే అవకాశం ఉంటుంది. 12 రెవెన్యూ గ్రామాల్లో రెండు మండలాల్లో 6వేల నుంచి 8 వేలు మధ్య జిరాయితీ భూములు ఉన్నాయి. ఆ భూములు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గిరిజనేతరులు హక్కులు కోల్పోతారు. గిరిజనేతరులకు ఇళ్లు, ఇతర ఆస్తులు సైతం షెడ్యూలు ఏరియాలోకి మార్పు చేస్తే క్రయ విక్రయాలు నిలిచిపోతాయి. అక్కడ గిరిజనేతరులకు ఉన్న స్థిరాస్తులన్నీ పూర్తిగా కోల్పోయి కుటుంబాలన్నీ రోడ్డున పడే ప్రమాదం ఉంది.

స్పీకరు దృష్టికి సమస్య

1/70 యాక్టు పరిధిలోకి మార్పు చేయకుండా నిలుపుదల చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు ముఖ్య నాయకులు స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాంతంపై సరైన అవగాహన లేని అధికారులు మైదానంలో ఉండే ఈ 12 రెవెన్యూ గ్రామాలను షెడ్యూలు పరిధికి మార్పు చేసేందుకు ప్రతిపాదనలు చేశారన్నారు. ఇక్కడ గిరిజన జనాభా తక్కువగా ఉన్నారని, భూములు కూడా తక్కువే ఉన్నాయన్నారు. 95శాతం పైగా గిరిజనేతరులు నివాసంతో పాటు స్థిర ఆస్తులు కలిగి ఉన్నారన్నారు. ప్రభుత్వం వద్ద ఉన్న ప్రతిపాదనలు కేంద్రానికి పంపించకుండా అడ్డుకోకపోతే వందలాది కుటుంబాల గిరిజనేతరులు రోడ్డున పడతారన్నారు. అక్కడ గిరిజనలకు తప్ప గిరిజనేతరులకు ఎలాంటి హక్కులు ఉండవు. స్థానిక సంస్థలు ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ పదవులు సైతం గిరిజనులే పోటీ చేయాలి. ఇక్కడ గిరిజనేతరులకు పోటీ చేసే అర్హత కూడా ఉండదని తెలిపారు.

నా చేతిలో ఏమీలేదు..



మండలంలో మూడు రెవెన్యూ గ్రామాలను 1/70 యాక్టు పరిధిలోకి మార్పు చేసేందుకు నేను రాకముందు పాడేరు ఐటీడీఏ అధికారి ద్వారా ప్రతిపాదనలు చేశారు. రాష్ట ప్రభుత్వం నుంచి కేంద్రానికి పంపించేస్తే మారిపోతుంది. ఇప్పుడు నాచేతిలో ఏమీ లేదు. ప్రభుత్వం నుంచి ఏదైనా సూచనలు వస్తే తప్ప ఇక్కడ నేను చేయాల్సింది ఏమీ లేదు.

– ఎ.వేణుగోపాల్ తహసీల్దార్

గిరినేతరులకు అన్యాయం జరిగితే ఉద్యమిస్తాం



కూటమి ప్రభుత్వం గిరిజనేతరులకు ఎలాంటి హాని తలపెట్టినా ఉద్యమిస్తాం. పూర్వం నుంచి సాగు చేసుకుంటున్న రైతులు వ్యవసాయ భూములు ఇప్పుడు 1/70 యాక్టు పరిధిలోకి మార్పు చేస్తే వారంతా ఏమైపోతారు? ఏళ్లతరబడి కుటుంబ సభ్యులు అన్నదమ్ముల్లా కలిసి ఉంటున్న గిరిజనులు, గిరిజనేతరులు మధ్య చిచ్చుపెట్టినట్టు అవుతుంది. కూటమి నేతలు ఈ విషయంపై దృష్టి సారించండి.. లేదంటే తర్వాత పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. ఆ గ్రామాలను ఎలాంటి మార్పులు చేయరాదు.

– ఆడిగర్ల రాజు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు

కీచక ఉపాధ్యాయుడికి రిమాండ్

- కేంద్ర కారాగారానికినిందితుడు తరలింపు
- వేధింపు ఘటనలను అరికట్టడానికి షీ టీమ్స్
- పాఠశాలల్లో గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలి
- ఎస్పీ తుహిన్ సిన్హా

బుచ్చియ్యపేట : ఉన్నత పాఠశాల విద్యార్థిని పట్ల లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో నిందితుడైన ఉపాధ్యాయుడిని రిమాండ్ నిమిత్తం విశాఖ కేంద్ర కారాగారానికి తరలించినట్టు అనకాపల్లి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ తుహిన్ సిన్హా తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో బుచ్చియ్యపేట మండలం వడ్డాది గ్రామంలోని ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని పట్ల అదే పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు ద్వారపూడి గంగా ప్రసాద్ లైంగిక వేధింపులకు పాల్పడడం, ఆమె తల్లిదండ్రులకు విషయం తెలియడంతో గురువారం నిందితుడిని పట్టుకుని నిలదీయడం, అటుపై పోలీసుల రంగప్రవేశంతో పోలీస్ స్టేషన్‌కు తరలించిన సంగతి పాఠకులకు విదితమే. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు 14 ఏళ్ల బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమో దు చేసి, శుక్రవారం చోడవరం కోర్టుకు తరలించగా నిందితుడిని 14 రోజుల రిమాండ్ విధించారన్నారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు విశాఖ కేంద్ర కారాగారానికి నిందితుడిని తరలించినట్టు ఆయన తెలిపారు. ఈ ఘటన చోటు చేసుకున్న సందర్భంగా జిల్లా లోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాలికలు, అమ్మాయిలపై జరిగే నేరాల పట్ల అవగాహన సదస్సులను నిర్వహించి వారిని చైతన్య పరచాల్సిందిగా అన్ని పోలీస్‌స్టేషన్లకు ఆదేశాలు జారీ చేసినట్టు ఎస్పీ తెలిపారు. వేధింపుల ఘటనలను అదుపు చేయడానికి షీ టీమ్స్, పోలీసు ప్రత్యేక వాహనాలు గస్తీ తిరుగుతున్నాయని, సంఘటనలకు బాధ్యులను కఠినంగా శిక్షిస్తామని ఆయన హెచ్చరించారు.

పంటల్లో తెగుళ్ల ఉధృతి అరికట్టాలి

అనకాపల్లి : వాతావరణంలో వరిలో ఆకు ముడత, కాండం తొలిచే పురుగు ఆశించే అవకాశం ఉన్నందున నివారణకు అసిఫేట్ 1.5 గ్రా. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాలివి.

వాతావరణ పరిస్థితులకు రసంపీల్చు పురుగుల ఉధృతి పెరిగి పల్లాకు తెగులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున తెగులు సోకిన మొక్కలను పీకి నాశనం చేయాలి. తెగులు వ్యాప్తి కారకాలైన రసం పీల్చు పురుగుల నివారణకు డైయితోయేట్ 2.0 మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

- అపరాలలో మారుకా మచ్చల పురుగు ఆశించే అవకాశం ఉంది. రెక్కల పురుగుల ఉనికిని గమనించాలి. కోరిపైరిఫాస్ 2.5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నట్టయితే ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పురుగు తీవ్రత ఎక్కువగా ఉంటే 7–10 రోజుల వ్యవధిలో మందులు మార్చి మార్చి కొట్టాలి.
- వేరు శనగ పంటలో రసం పీల్చు పురుగులు ఆశించే అవకాశం ఉన్నందున నివారణకు వేప నూనె 5 మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి. వెర్రి తెగులును వ్యాప్తి చేసే దీపపు పురుగుల ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ లేదా ఎసిటామిప్రిడ్ 0.3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. మచ్చెలు నాటిన 3 రోజుల లోపు అట్రాజిన్ 50 శాతం పొడి మందును ఎకరానికి 2 కిలోలు లేదా మెట్రిబుజిన్ 600 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పొలమంతా పిచికారీ చేసి ఒక నెల వరకు కలుపు నివారించుకోవచ్చు. చాళ్ల మధ్యలో జనుము విత్తుకుని 40 రోజులకు కలియ దున్నాలి.
- చెరకు నాటే ముందు ఎకరాకు కార్బొఫ్యూరాన్ 3 జి 13 కిలోలు లేదా ఫిప్రొనిల్ 0.3 జి 10 కిలోలు లేదా క్లొరాంటినిల్ 0.4 జి 9 కిలోలు చొప్పున చాళ్లల్లో 1.2 నిష్పత్తిలో ఇసుకతో కలిపి వేసినట్టయితే పీక పురుగు ఉధృతిని తగ్గించవచ్చు.
- మిరపలో నల్లి, తామర పురుగుల ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున నివారణకు ఫిప్రొనిల్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. జీడి, మామిడిలో టీ దోమ ఆశించే అవకాశం ఉన్నందున నివారణకు మెదటిసారి కొత్త చిగురు వచ్చే సమయంలో మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ కామప్ ఆక్సీక్లోరైడ్ 2.5 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. రెండోసారి పూత వచ్చిన తరువాత క్లోరిపైఫాస్ 2.5 మి.లీ కాపర్ ఆక్సీక్లోరైడ్ 2.5 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

నిద్రపోతున్న 'టూరిజం'

కొమ్మాది(విశాఖ): అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన రుషికొండ బీచ్‌లో అడుగడుగునా పర్యాటక శాఖ నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఈ బీచ్‌ను నిర్వహణను అధికారులు, సిబ్బంది గాలికొదిలేశారు. మరోవైపు బోటు షికారు, సీ వ్యూ పాయింట్ వద్ద టికెట్ దందాలు జరుగుతున్నాయి. ఈ వ్యవహారాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా తూతూమంత్రంగా ఎవరో ఒక ప్రైవేట్ సిబ్బందిపై చర్యలు తీసుకుని మమ అనిపించేస్తున్నారు. ఇక్కడ మేనేజర్‌గా వ్యవహరిస్తున్న రజిత్ వ్యవహారశైలిపై అధికారులకు పలు ఫిర్యాదులు అందినా పట్టించుకున్న పాపాన పోలేదు. ఆయన కింద పనిచేసే సిబ్బంది ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో ఈ చిత్రమే సాక్ష్యం. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఇక్కడ కొంత మంది జూనియర్, సీనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. టూరిజం బోట్ల నిర్వహణ ఎలా ఉంది? టికెట్ కౌంటర్, కంట్రోల్ రూమ్ వద్ద పరిస్థితిని గమనించి ఎప్పటికప్పుడు అధికారులకు సమాచారం అందివ్వాలి. కానీ వీరు మాత్రం వచ్చామా.. తిన్నామా.. పడుకున్నామా... వెళ్లిపోయామా అనే రీతిలో వ్యవహరిస్తున్నారు. విధులు మరిచి చల్లటి గాలికి హాయిగా నిద్ర పోతున్నారు. దీనిపై టూరిజం డివిజనల్ మేనేజర్ జగదీష్‌ను వివరణ కోరగా ఇలాంటి పునరావృత్తం కాకుండా కఠినమైన చర్యలు తీసుకుంటామని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే క్షమించేది లేదని స్పష్టం చేశారు.

పోర్టు స్టేడియంలో స్నో స్టేషన్ ప్రారంభం


జారుతున్న చిన్నారి


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న పోర్ట్ ట్రస్టు చైర్మన్ అంగముత్తు

విశాఖ స్పోర్ట్స్: వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి నీటిలో ఆటలాడటం సహజం. కానీ మండుటెండల్లో మంచుతో ఆడుకునే అవకాశం వస్తే ఎలా ఉంటుంది? విశాఖ వాసులకు సరిగ్గా అలాంటి అద్భుత అనుభూతిని అందించడానికి నగరం నడిబొడ్డున, పోర్టు స్టేడియంలో 'స్నో స్టేషన్'పేరుతో సరికొత్త మంచు వినోద కేంద్రం రూపుదిద్దుకుంది. దేశంలో కొన్ని నగరాల్లో ఇలాంటి కేంద్రాలు ఉన్నప్పటికీ, రాష్ట్రంలో మాత్రం ఇదే మొదటిది కావడం విశేషం. సుమారు 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ స్నో స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో 12 అడుగుల మందంతో మంచును పరచగా, మొత్తం నిర్మాణం 35 అడుగుల ఎత్తులో ఉంటుంది. కళా దర్శకుడు రవి(దసరా సినిమా ఫేం) ఈ స్నో స్టేషన్ లోపలి భాగాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. సందర్శకులు మంచుపై బాల్ గేమ్స్ ఆడటమే కాకుండా, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మంచు వాలుపై జారిపోతూ సరికొత్త అనుభూతిని పొందవచ్చు. ఈ స్నో స్టేషన్‌లో ప్రవేశించడానికి పెద్దలకు ఒక్కొక్కరికి రూ.799, పిల్లలకు రూ. 649గా టికెట్ ధర నిర్ణయించారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు తెరిచి ఉండే ఈ వినోద కేంద్రంలో గంట సమయం చొప్పున స్లాట్లు కేటాయించారు. లోపలి చలి వాతావరణాన్ని తట్టుకోవడానికి చేతి గ్లోవ్స్, బూట్లు వంటివి నిర్వాహకులే అందిస్తారు. ఒక్కసారి లోపలికి వెళ్తే చాలు గంటసేపు చల్లటి వాతావరణంలో సరదాగా గడపవచ్చు. విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ స్నో స్టేషన్‌ను విశాఖ పోర్ట్ అథారిటీ చైర్మన్ మాధయ్యన్ అంగముత్తు శుక్రవారం ప్రారంభించారు

300 మందికి ఉపాధి

విశాఖ పర్యాటకంగా అభివృద్ధి చెందుతోంది. పర్యాటకులను ఆకర్షించేందుకు మరో హంగుగా స్నో స్టేషన్‌ను ఏర్పాటు చేశాం. రాష్ట్రంలోనే ఇది మొదటి మంచు స్టేషన్. పోర్ట్ స్టేడియంలో విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ ఆటలతో పాటు అడ్వెంచర్ యాక్టివిటీస్‌ను ఏర్పాటు చేశాం. ఇక్కడ గో కార్ట్ ట్రాక్ కూడా ఉంది. ఎక్కడెక్కడి నుంచో వచ్చే సందర్శకులకు ఇది ఒక వినోద గమ్యస్థానంగా తీర్చిదిద్దాం. దాదాపు 300 మందికి ఉపాధి కల్పిస్తున్నాం.

– కె.ప్రమోద్, ఎండీ, స్నో స్టేషన్

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

యలమంచిలి రూరల్ : ఏటికొప్పాక శివారులో పేకాడుతున్న ముగ్గురిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్టు యలమంచిలి రూరల్ పోలీసులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం గ్రామ శివార్లకు వెళ్లిన పోలీసులకు అక్కడ పేకాడుతున్న వారిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 52 పేకముక్కలు, రూ.2300 నగదు స్వాధీనపర్చుకున్నారు. ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. ఎక్కడైనా జూద క్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు ఈ సందర్భంగా హెచ్చరించారు.

నీవే స్ఫూర్తి.. యువతకు చైతన్య దీప్తి

కనులపండువగా వివేకానందుని శోభాయాత్ర


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

ఏయూక్యాంపస్/డాబాగార్డెన్స్:

భారతీయ ఆధ్యాత్మిక శక్తిని ప్రపంచానికి చాటి చెప్పిన వివేకానంద స్వామి నేటి తరానికి నిజమైన స్ఫూర్తిగా నిలుస్తారు. వివేకానంద జయంతి ఉత్సవాల్లో భాగంగా రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో శోభాయాత్ర జరిగింది. ప్రభుత్వ మహిళా కళాశాల వద్ద ప్రారంభమైన ఈ యాత్ర బీచ్‌రోడ్డులోని రామకృష్ణ మిషన్ వరకు సాగింది. ముందుగా ఈ యాత్రను కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ప్రారంభించి మాట్లాడారు. వివేకానందుని స్ఫూర్తితో యువతరం ఉన్నతంగా రాణించాలని పిలుపునిచ్చారు. పెద్ద సంఖ్యలో యువత ఈ యాత్రలో పాల్గొనగా.. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు వివేకానందుని విగ్రహానికి పూలమాలలు, పుష్పాలు అర్పించారు. పలువురు విద్యార్థులు వివేకానందుడు, భారతమాత వేషధారణలో ర్యాలీలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వివేకానందుడి సూక్తులతో కూడిన ప్లకార్డులు పట్టుకుని ర్యాలీలో పాల్గొన్నారు. నిలువెత్తు వివేకానందుని విగ్రహంతో యువత ఫొటోలు తీసుకోవడానికి ఆసక్తి చూపారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డి.సూర్య ప్రకాశరావు, రామకృష్ణ మిషన్ ఆశ్రమ కార్యదర్శి స్వామి స్వసమవేద్యానంద, రామకృష్ణ మిషన్ స్వామిజీ గీతాసకరానంద, ఎం.సత్యనారాయణ రాజు, ఏయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల తదితరులు పాల్గొన్నారు.


సెల్ఫీ తీసుకుంటున్న కేడెట్లు


ర్యాలీని ప్రారంభిస్తున్న విశాఖ కలెక్టర్ హరేందిర ప్రసాద్